విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 5, ఫిబ్రవరి 2025

పక్కాగా భూముల రీసర్వే చేయండి

విశాలాంధ్ర-శెట్టూరు : మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో రెండో విడత భూముల రీసర్వే పనులను మంగళవారం ఆర్డీవో వసంత్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మాదిరిగా కొలతల్లో తప్పులకు తావు లేకుండా, భూ యజమానులు రైతుల నుంచి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా రీసర్వే చేపట్టాలని సూచించారు. ఈ రెవెన్యూ గ్రామంలో మొత్తం 7,137 ఎకరాల 21సెంట్లు ఉండగా ఏఒక్క రైతుకు ఇబ్బంది లేకుండా రీసర్వేను చేసి ప్రతి రైతుకు న్యాయం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వర్‌శెట్టి మండల సర్వే యర్‌లు మున్వర్ భాషా, సుబ్రహ్మణ్యం, వీఆర్వో తిప్పేస్వామి, విశ్వనాథ్, విలేజ్ సర్వేయర్ పవన్, ముక్కనేశ్వర రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిప్పారెడ్డిపల్లిలో ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణం లో తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధుసూదనరాజు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్‌కు ఐదుగురిని గుర్తించారు. అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరాముడు, 104 డిఇఓ అనిల్, పైలట్ బాలాజి, ఏయన్‌యం స్వర్ణలత పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా నీలకంఠ

విశాలాంధ్ర-నార్పల : మండల నూతన విద్యుత్ ఏఈగా నీలకంఠ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సమ స్యలు పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

ఆశ కార్యకర్తలు బాగా పనిచేయాలి

విశాలాంధ్ర-యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆశాడే కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఆశా కార్యకర్తలకు ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి వివరించి కచ్చితంగా గ్రామంలో ప్రతినెల వారికి ఇచ్చిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ఫిక్స్ టూర్ ప్రోగ్రాం ప్రకారం వారి వారి గ్రామంలో పర్యటించాలని తెలిపారు. గ్రామంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే, వ్యక్తార్ కంట్రోల్ ప్రోగ్రాం ప్రతి సోమవారం రైట్ చేసి బుధవారం లోపల ఇష్యూను క్లోజ్ చేయాలని తెలిపారు సిహెచ్ఓ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్ పేపర్ల పంపిణీ

విశాలాంధ్ర-శెట్టూరు : మండల పరిధిలో మాకొడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవతరగతి విద్యార్థు లకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత రూపొందించబడిన 10వ క్లాస్ మోడల్ పేపర్స్ ఉపాధ్యాయుడు బద్దె నాయక్ ఉచితంగా అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులుతో సాధించాలని ఆకాంక్షించారు. మోడల్ పేపర్ల నుంచి 70శాతంపైగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమం లో హెచ్‌ఎం భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హీరేహాల్‌లో వాల్మీకి విగ్రహానికి స్థలం కేటాయించాలి..

తహసీల్దార్‌కు బోయకులస్తుల వినతి

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : హీరేహాల్ గ్రామానికి చెందిన బోయ కులస్తులు తమ గ్రామంలో వాల్మీకి విగ్రహానికి స్థలం కేటా యించాలని మంగళవారం ఎమ్మార్వో మునివేలకు వినతిపత్రం ఇచ్చారు. మండల సర్వేయరును పంపి స్థలం చూపుతామని హామీ ఇచ్చారు. అలాగే మొహరం పండుగ సందర్భంగా దేవుడు వెనక వందలాదిమంది కాలినడకన వెళ్లే దారిలో కొందరు స్థలాన్ని ఆక్రమించి మట్టితోనే దావా ఇబ్బంది కలిగించారు. ఆ మట్టిని తొలగించి ప్రజలు కాలనాడక దారి ఏర్పాటు చేసి వాల్మీకి విగ్రహా నికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు, ఎంపీటీసీ భర్త ఎర్రిస్వామి, చెలిమే మల్లేష్, గంటెమారేష్, లోకేష్, వన్నూరస్వామి, చంద్రబాబు, గోపాల్, నాగరాజు, వెంకటేష పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులు.. ప్రకాష్ రెడ్డి సోదరులు

- రోడ్డు లేక స్కూల్ పిల్లలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోలేదు
-చాపట్ల రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాలాంధ్ర-రాప్తాడు: నిర్మాణంలో ఉన్న రోడ్డు నిలిపివేసి.. చిన్నపిల్లలు, రైతులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని నాయకులు తోపుదుర్తి సోదరులు అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని మరూరు గ్రామ జాతీయ రహదారి నుంచి చాపట్ల వరకు నూతనంగా నిర్మించిన 2.80 కిలోమీటర్ల తారు రోడ్డును మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన సునీతకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఎల్.నారాయణ చౌదరి, మండల ఇన్చార్జి ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, మరూరు గోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, చాపట్ల కుమార్, వడ్లమూడి కేశవ, మేనక, తలారి మధు, నారాయణస్వామి, డీలర్లు చంద్రాయుడు, సూరీ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గ్రామంలో గత కొన్నేళ్లుగా రోడ్డు లేక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. 2018లో తాను మంత్రిగా ఉన్న సమయంలో 2. 80 కిలోమీటర్ల తారు రోడ్డుతో పాటు నాలుగు కల్వర్టులు నిర్మించేందుకు రూ.1. 60కోట్లు మంజూరు చేయించి.. 2019లో పని మొదలు పెట్టి మెటల్ రోడ్డు కూడా పూర్తి చేశామన్నారు. అనంతరం వైసీపీ అధికారం లోకి రావడం ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యే కావడం జరిగిందన్నారు. అయితే పెండింగ్ లో ఉన్న పని పూర్తి చేయాల్సింది పోయి.. రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారన్నారు. మళ్లీ గ్రామ ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. ఎన్నికల ముందు తాను వచ్చినప్పుడు ఈ సమస్య నా దృష్టికి రావడంతో అధికారం లోకి రాగానే నిధులు విడుదల చేయించి మూడు నెలల్లోనే మొదలుపెట్టి పని పూర్తి చేశామన్నారు. నేడు గ్రామస్థుల ఆనందం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. 2019 ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డిని గెలిపిస్తే.. అభివృద్ధికి తిలోదకాలిచ్చాడని ధ్వజమెత్తారు. ఇందుకే గత ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పారన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదాం..

గేట్స్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-గుత్తి: పట్టణంలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా గేట్స్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల విద్యార్థులు క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా గుత్తి పట్టణంలోని అనంతపురం రోడ్డు లో గల పెట్రోల్ పంపు నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. గాంధీ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడ గేట్స్ కళాశాల ఎం.డి.రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టవచ్చని, మా కుటుంబంలో క్యాన్సర్ తో జరిగిన సంఘటనలు మమ్మల్ని ఎంతో బాధించాయని ఇలా అందరికీ జరగకూడదని ఉద్దేశంతో ఇప్పటి నుంచే విద్యార్థులకు కాన్సర్‌పై అవగాహన కలిగి ఉండడం కోసం అలాగే ప్రజలకి కూడ అవగాహన కలిగి ఉండడం కోసం నేడు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించా మన్నారు. వైద్యాధికారులు డాక్టర్ పరమేష్, డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, నిలువ ఉన్న పచ్చళ్ళు, ఫ్రిజ్‌ల్లో ఎక్కువ రోజులు నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, బేకరీ ఫుడ్‌లు, ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ తదితర వాటిని విరివిగా వాడటం వల్ల కాన్సర్ వ్యాధికి గురవుతారని తెలిపారు. ఆకుకూరలు, కాయకూరలు, పాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ లాంటి వ్యాధులకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వద్దు ..

సిడిపిఓ శ్రీదేవి

విశాలాంధ్ర-ఉరవకొండ : విధుల పట్ల అంగన్వాడి సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సిడిపిఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాల యంలో సూపర్ వైజర్స్, ఆఫీస్ స్టాఫ్‌తో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైన త్రాగునీరు, టాయిలెట్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు ఆర్డబ్ల్యుఎస్ ఏఈ తో వెంటనే పూర్తి చేయించాలని, పిల్లల బరువులు, ఎత్తులు, జాగ్రత్తగా ఒక బిడ్డకు రెండు సార్లు వేసి పోషణ ట్రాకర్ యాప్ లో 5 వ తేదీ లోపు పూర్తి చేయించాలని, అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, ప్రీ స్కూల్ కార్యక్రమాలు సిలబస్ ప్రకారం నిర్వహించాలని, సూచించారు. పంచాయితీలో అంగన్వాడీ కేంద్రాలు జాగ్రత్తగా నిర్వహించాలని, 5వ తేదీ ఈసీసీఈ డే ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించాలనీ ఇందులో భాగంగా అంగన్వాడీ ఇంప్రూవ్‌మెంట్ డేలో 0-3 సం. పిల్లల తల్లులకు వారి పిల్లల బరువులు, ఎత్తులు, చూపించి గ్రోత్ మానిటరింగ్ ప్రాముఖ్యత గురించి తెలియ చెయ్యాలని బాల్యవివాహాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. సమావేశంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా గర్భిణులకు పౌష్టికాహారం

విశాలాంధ్ర-రాప్తాడు: క్రమం తప్పకుండా గర్భవతులకు పౌష్టికాహారం అందేలా చొరవ చూపాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. రాప్తాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో గర్భవతులందరి ఇంటికి వెళ్లి ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా బాలింతలను 42 రోజులపాటు 7సార్లు గృహ సందర్శన చేసి బాలింతలు,, శిశువుల ఆరోగ్యాన్ని పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆశాలు ఉపయోగించే మొబైల్ యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్వైజర్లు అరుణ, నరసింహ, ఎం.ఎల్.హెచ్.పి లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మగ్దూం మొహియుద్దీన్ నేటి తరానికి ఆదర్శం

ఉద్యమ కెరటం.. పోరాట యోధుడు.. సూర్యుడు

విశాలాంధ్ర-అనంతపురం బ్యూరో.. ఉద్యమ కెరటం.. పోరాట యోధుడు, నిస్సహాయుల ఆశాజ్యోతి, మగ్దూం జీవిత నేటి తరానికి ఆదర్శం.. ఎస్టియూ సంఘ రూపకర్త, వ్యవస్థాపకులు.. కమ్యూనిస్ట్, ఉపాధ్యాయుల చైతన్య కిరణం.. కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్.. అని పలువురు వక్తలు కొనియాడారు రమణారెడ్డి. మంగళవారం ఎస్టియూ కార్యాలయం, అనంతపురం ఎస్టియూ జిల్లా శాఖ అధ్వర్యంలో "కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్" 117వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ఎస్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ మగ్దూం మొహియుద్దీన్ 4 ఫిబ్రవరి 1908న జన్మించి తను స్వాతంత్ర్య సమరయోధుడిగా, మహాకవిగా, కార్మిక నాయకుడిగా, నటలులుగా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరిగా, శాసనసభ, మండి సభ్యులు గాను, ఎన్నో కార్మిక, కర్షక , ఉద్యోగ సంఘాల ఏర్పాటుకు ఆద్యుడై వారి హక్కుల సాధన కోసం పోరాడిన పోరాట యోధుడని, అలా స్థాపించిన ఉపాధ్యాయ సంఘమే నేటి ఎస్టియూ సంఘమని కొనియాడారు.

ఎస్టియూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనలో విద్యా ,ఉపాధ్యాయుల విలువ లను, హక్కులను కాపాడేందుకు, ఉపాధ్యాయుల నాటి దుర్భర పరిస్థితులను, నిస్సహాయతలను గ్రహించి, ఆగ్రహించి ...వారి హక్కుల కోసం.. ఉపాధ్యాయుల బానిస సంకెళ్ల విముక్తి కోసం.. స్వతంత్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టియూ)ను తన స్వగృహంలో 1946 మే 17 న ఎర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు. రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడిన గొప్ప పోరాట యోధుడుని,తను నిరుపేద కుటుంబంలో జన్మించి బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడని, పత్రికల్లో పనిచేశాడని, కవిగా,నాటక రచయితగా, నటుడిగా ప్రసిద్ధుడయ్యారని 1934లో బెర్నార్డ్ షా నాటకానికి 'హోష్ కెనా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ వ్రాసి రవీంద్రనాథ్ ఠాగూర్ సమక్షంలో ప్రదర్శించారు. "రైతుకు రొట్టె నివ్వని పొలమెందుకు, కాల్చేయండి ప్రతి గోధుమ కంకిని..!" అనే ఇక్బాల్ కవితను నినదించి ఉద్యమించేవారని పేర్కొన్నారు. జిల్లా అదన ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ... మగ్దూం మొహియుద్దీన్ గారి పోరాట జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకొని పోవాలని, కులాల, మతాల, వర్గాలకు అతీతంగా.. కార్మిక కర్షక,ఉద్యోగ, ఉపాధ్యాయ, బడుగు బలహీనుల,మహిళల హక్కుల కై ఉద్యమించాలని వారి ఆశయ సాధనకై కృషి చేయాలని భావించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అజయ్ కుమార్, జిల్లా నాయకులు బాబ్జి నాయక్ రామకృష్ణ పాల్గొన్నారు.

అత్యాచార ఘటనలపై మిత్రపక్షాల పార్టీల ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-గుత్తి : పట్టణంలో మంగళవారం గుంటూరు జిల్లా పెదనందిపాడులో 64 సంవత్సరాల వృద్ధురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై అలాగే అయోధ్యలో దళిత యువతిపై జరిగిన అత్యాచార ఘటనలపై బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో మిత్రపక్షాల పార్టీలతో కలిపి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బిఎస్పి పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం నియోజకవర్గం అధ్యక్షుడు విజయ్ మాట్లా డుతూ అత్యాచార నిందితులను వెంటనే అరెస్టు చేయాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే మున్ముందు పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, నియోజకవర్గ ఇంచార్జ్ బి.శ్రీని వాసరాజు, విజయ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సుంకలమ్మ రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలువ

విశాలాంధ్ర-కణేకల్లు: మండల పరిధిలోని మాల్యం గ్రామంలో ఊరి చివర ఉన్న శ్రీ సుంకులమ్మ దేవి సంబరాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి రథోత్సవ కార్యక్రమం ఘనంగా గ్రామస్థులు నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల వారు శ్రీ సుంకులమ్మ వారి దర్శనార్థం రథోత్సవం కార్యక్రమానికి తండోపతండాలుగా ప్రజలు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, టీడీపీ కార్యకర్తలు, వైసీపీ మెట్టు గోవింద్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు అందరూ ఈ రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుండి వాసవి మాత విగ్రహ ప్రతిష్టాపన

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన వాసవి కన్యక పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అద్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ పూజలు ప్రారంభం అవుతున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు ముద్దు మల్లికార్జున, ఆర్వేటి లేపాక్షి శెట్టి తెలిపారు. బుధవారం గంగజలం తెచ్చి గంగపూజ, మహా గణపతి పూజ, పుణ్యాహవాచ రక్షాబంధనం, మహాసంకల్పం, పంచగవ్య, దేవనాంది, వాస్తు, రాక్షోఘ్న, అఘోరాస్త్ర హెూమము, పర్యాగ్నికరణ, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలతో ప్రారంభం అవుతాయని తెలిపారు. గురువారం జలాధివాసం, క్షీరాధివాసం, గ్రామ ప్రదక్షిణ ఉంటుందని, జరుగుతుందని శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి, శ్రీమహా గణపతి, శ్రీ సు బ్రమణ్యేశ్వరస్వామి, నాగ విగ్రహాల ప్రాణ ప్రతిష్ట చేసి అమ్మవారి మూలమంత్ర హెూమం, తత్వన్యాస, కళాన్యాస, చండీహెూమం, పూర్ణాహుతి జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పశువుల షెడ్లు 100 శాతం పూర్తి చేసిన వారికి సన్మానం..

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కళ్యాణదుర్గం నాగేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి దాస నాయక్ పరిపాలన అధికారి ఏ బలరామ రావు, విస్తరణ అధికారి యోగానంద సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్ల నిర్మాణంలో 100 శాతం పూర్తి చేసిన ఉపాధి హామీ ఇంజనీరు టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లు పెన్షన్ పంపిణీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం వచ్చేందుకు కృషి చేసిన గ్రామపంచాయతీ కార్యదర్శులకు, మండల పరిషద్ సిబ్బందికి, సన్మానించారు. ఈ కార్య క్రమంలో ఉపాధి హామీ రవి, జూనియర్ అసిస్టెంట్ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజు గారు కార్‌లో.. భటులు బయట సోదా..

విశాలాంధ్ర-గార్లదిన్నె: కల్లూరు ఎన్‌హెచ్ 44లో అనంతపురం ఆర్టీవో విధులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కల్లూరు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కల్లూరు హైవే మీదుగా వెళుతున్న వాహనాలను ఆర్టీవో కారులో కూర్చుండగా బయట బటులు వాహనాలను ఆపి తనిఖీలు చేసి వాహనం రికార్డు ఏమాత్రం లేకపోయినా అక్కడక్కడే లంచం పుచ్చుకొని వాహనాలను పంపిస్తున్నారని.. ఇదంతా ఆర్టీవో ఆధ్వర్యంలోనే జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కల్లూరు గ్రామానికి చెందిన సీఎస్సీ సెంటర్ నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులు వారే వాహనాలను ఆపి వారే తనిఖీలు చేసి వారే ఫైన్ వేసి లంచం పుచ్చుకుంటున్నారని ఇదంతా ఆర్టీవో ఆధ్వర్యంలోనే జరుగుతోందని కల్లూరు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. వాహనాలను తనిఖీ చేసే ఒక ఉన్నత అధికారి ఇలా చేయడం సమంజసమ అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకునే వారే లేరా అని ప్రశ్నిస్తున్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఎంతైనా ఉందని అంటున్నారు.

చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

విశాలాంధ్ర-నార్పల : చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొని రావాలని ఎంపీడీవో గంగావతి, ఈఓఆర్డి శైలజరాణి, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్ జనార్దన్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సూచించారు . మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డి శైలజ రాణి, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్ జనార్దన్ మాట్లాడుతూ మండలంలోని అన్నీ చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకొని రావాలని అదేవిధంగా అన్ని పంచాయతీల్లో క్లాప్ మిత్రులను నియమించుకుని తడి పొడి చెత్త సేకరించాలి అన్ని చెత్త సంపద కేంద్రాల వద్ద నీటి వసతి కల్పించాలి. త్వరలోనే మండలం లోని అన్ని గ్రామాల్లో చెత్త నుండి సంపద సృష్టించాలి అని తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్‌శాఖకు మంచిపేరు తేండి

ఏ.ఆర్ 'డీ మొబలైజేషన్‌లో ఎస్పీ వి.రత్న

విశాలాంధ్ర-పుట్టపర్తి: క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీస్‌శాఖకు మంచిపేరు తీసుకురావా లని ఎస్పీ రత్న పేర్కొన్నారు. మంగళవారం పరేడ్ గ్రౌండ్లో ఏఆర్‌డి మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం గా జరిగిన సంఘటనలలో సాంఘిక,రాజకీయ, మతపరమైన, అధికార కార్యక్రమాలలో,ఏ ఆర్ శాఖ అత్యంత క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు విభాగానికి ఎంతో పేరు తీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం జిల్లా ప్రశాంతంగా ఉందంటే ఏఆర్ విధులు అమోఘం అన్నారు. తాను మొట్టమొదట జిల్లాలో విధులు చేపట్టినప్పుడు మడకశిర ప్రాంతంలోని గుండుమల గ్రామంలో ముఖ్యమంత్రి ప్రోగ్రాం విజయవంతం చేయడంలో ఎంతో కీలకంగా పనిచేశా రన్నారు. జిల్లాలో జరిగిన వినాయక నిమజ్జనం, గొడవలు రాజకీయ సంఘటనలు ఆందోళనలు ప్రదర్శనలలో అత్యంత కీలకమైన భద్రతా విధులు నిర్వహించారన్నారు. హిందూ పురం, తాడిమర్రి, ఇస్తిమా సందర్భంగా భద్రతా చర్యలు చేపట్టడమే కాక శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి ఉత్సవాలు పాల్గొన్న గవర్నర్, డిజిపి విఐపి భద్రత ఏర్పాటు చేయడంతో పాటు స్వతంత్ర దినోత్సవం పోలీస్ స్మారక దినోత్సవం గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రమశిక్షణతో కవాతు పరేడ్ నిర్వహించారన్నారు. డీ మొబిలైజేషన్ పెరేడ్‌ను క్రమశిక్షణతో అద్భుతంగా చేసిన పెరేడ్ కమాండర్‌లను ఎస్.పి అభినందిం చారు. మొబిలైజేషన్ ప్రక్రియలో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి, మొబిలైజేషన్‌లో ఫైరింగ్, టర్న్ అవుట్ అండ్ ప్రొఫిషియెన్సీ పేటెస్ట్, డ్రైవింగ్‌లో ప్రతిభ కనబరచిన వారికి ఎస్పీ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు పుట్టపర్తి డీఎస్పి విజయ్ కుమార్, ఆర్.ఐలు మహమ్మద్ వలి, మహేష్, ఆర్.ఎస్.ఐ.లు, వీరన్న ప్రదీప్ ,సింగ్ ప్రసాద్ ఏ.ఆర్ సిబ్బంది పాల్గొన్నారు. ఫైరింగ్లో ప్రతిభ కనబరిచిన వారు శ్రీధర్, నారాయణస్వామి, ఏవీరెడ్డి వీరాంజనేయులు, శక్షావలి, చాంద్‌బాషా, భాస్కర్, గోవిందు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

సీటు బెల్టు, హెల్మెట్‌లతో ప్రయాణం సుఖవంతం

విశాలాంధ్ర-ధర్మవరం : వాహనదారులు సీటు బెల్టు, హెల్మెట్లతో ప్రయాణం చేస్తే సుఖవంతమైన ప్రయాణం అవుతుందని ఎస్పీ రత్న తెలిపారు. మంగళవారం జాతీయ రహదారి మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రెండవ పోలీస్ స్టేషన్ వద్ద నుండి రైల్వే ఓవర్ బ్రిడ్జి కళాజ్యోతి సర్కిల్ ఎన్టీఆర్ సర్కిల్ గాంధీనగర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీచేపట్టారు. పట్టణములోని సీఐలు, డీఎస్పీ హేమంత్‌కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ సీటుబెల్ట్, హెల్మెట్ లేకుండా, మద్యంతాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు నడిపిస్తే జరిమానాతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రేని డిఎస్పీ పావని, వన్టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ 2 టౌన్ సిఐ రెడ్డప్ప, రూరల్ ఎస్సై శ్రీనివాసులు, ఎస్సైలు, బ్రేక్ ఇన్స్పెక్టర్, తాడిమర్రి ఎస్సై, సచివాలయమహిళా పోలీసులు పాల్గొన్నారు.

దీపం పథకం-2 పటిష్టంగా అమలు చేయండి

- సంయుక్త కలెక్టరు అభిషేక్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో, శ్రీ సత్యసాయి : దీపం పథకం -2 పటిష్టంగా అమలు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టరు అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని కోర్ట్ హాల్ ఛాంబర్‌లో పుట్టపర్తి మండల పరిధిలోని గ్యాస్ ఏజెంట్స్ ప్రతినిధులతో దీపం పథకం-2పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులు అయిన పేద కుటుంబబాల వారికి సంవత్సరానికి మూడు (3) గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ఈ పథకంలో జిల్లాలో ఉచితంగా సిలిండర్లు పొందుతున్న లబ్ధిదారులు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు ఖాతాల్లో జమ అవుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుండి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్‌లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.. ఫిర్యాదులు రుజువు అయితే గ్యాస్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ పథకం కింద ఏ ఒక్కరూ అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08555289039కు, ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి..

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

విశాలాంధ్ర-ధర్మవరం: స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఈ బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా వెబ్సైటు నందు జనవరి 31వ తేదీ నుండి ఫిబ్రవరి 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు బీసీ ఈ బీసీ వారికి 21 - 60 సంవత్సరాల మధ్య ఉండాలి అని తెలిపారు. బిపిఎల్ కుటుంబాలకు చెందిన వారు అయి ఉండాలని జనరిక్ మెడికల్ షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి బి ఫార్మసీ, డి ఫార్మసీ చేసిన వారు అర్హులని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రము, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, బ్యాంక్ పాస్ బుక్ మొదలగు డాక్యుమెంట్స్ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చేపల పిల్లల పెంపక కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కలెక్టర్ టీఎస్. చేతన్

విశాలాంధ్ర బ్యూరో, శ్రీ సత్యసాయి : సిబిఆర్ రిజర్వాయర్లో చేపల పిల్లల పెంపక కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన స్కీం అంశంపై డీఎల్సీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సంబంధిత అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన అమలుపై విస్తృతంగా మత్స్య కారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. డిఎల్‌సి కమిటీ సభ్యులలో ఇద్దరు ఖచ్చితంగా మత్స్యకారులు సభ్యులుగా ఉండాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకులలో ఎక్కడెక్కడ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వచ్చి సంపద వృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. మత్స సంపద వృద్ధితో ప్రజలకు పోషకాహారం తో పాటు ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు చేపల పెంపకానికి మహిళలు, ఎస్సీ, ఎస్టీ,60 శాతం ఇతరులకు 30 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పిడి నర్సయ్య, ఎల్‌డిఎం రమణకుమార్, జెడి అగ్రికల్చర్ సుబ్బారావు, పశుసంవర్ధక శాఖ అధికారి, ఇరిగేషన్ అధికారులు, పాల్గొన్నారు.

తాగునీటి వనరులు గుర్తించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: వేసవిలో తాటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కన్ఫరెన్స్ హాలు నందు ఆర్డబ్ల్యుఎస్ డిపిఓ ఆధ్వర్యంలో నీటి ఎద్దడి నివారణ కొరకు ముందస్తు ప్రణాళికలపై ఉమ్మడి జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, ఆర్డబ్ల్యుఎస్ఎ ఈ మల్లికార్జున, డిపిఓ సమత సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఆరు నెలల్లో జిల్లాలో తాగునీటి సమస్యకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని ఎస్సీ ఆర్డబ్ల్యుఎస్ను ఆదేశించారు. నీటి సమస్యను నివారించడానికి ప్రాథమిక నిర్వహణ పనుల నిధులకు సంబంధించిన ప్రణాళికలు అమలు చేయాలని డిపిఓను ఆదేశించారు. జిల్లాలోని ఎంపీడీఓలతో సమన్వయం చేసుకుని సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జడ్పీ డిప్యూటీ సీఈవోను ఆదేశించారు. 32 మండలాలకు తాగునీటి సరఫరాకు పంపిన ప్రతిపాదనల నివేదికలు నాకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

క్యాన్సర్ మహమ్మారిని పారదోలుదాం..

ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌డెండెంట్ డాక్టర్ మాధవి

విశాలాంధ్ర-ధర్మవరం: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కొరకు ర్యాలీని నిర్వహించడం జరిగిందని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌డెండెంట్ డాక్టర్ మాధవి తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి పట్టణంలోని పలు వీధులు గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారముగా ఏర్పడి క్యాన్సర్ వ్యాధి నుండి ఎటువంటి వైద్య చికిత్సలు పొందవచ్చును, నివారించవచ్చును అన్న విషయంపై వారు పలు విషయాలను తెలియజేశారు. అనంతరం డాక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రజలందరూ కూడా క్యాన్సర్ వ్యాధిపై తప్పక అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. మహిళలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ,రొమ్ము క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించారు. వీటి నిర్మూలనకై టీకాలు వేయించుకోవాలని తెలిపారు. పొగాకు ఉత్పత్తులు వాడరాదని ప్రాథమిక దశలోనే స్క్రీనింగ్ ద్వారా తెలుసుకొని తగిన వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నజీర్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సెల్వియా సల్మాన్, యూపీహెచ్‌ఎస్సి మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

తొలి దశలోనే గుర్తించి చికిత్స పొందాలి

విశాలాంధ్ర-ధర్మవరం : క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి సరియైన వైద్య చికిత్సలను పొందాలని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అంటూ వ్యాధులు పలు రోగాలను నివారించడంలో చికిత్స అందించడంలోను, మరణా లను అరికట్టవచ్చునని తెలిపారు. క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతుల సంఖ్య పెరుగుతున్నాయని, కారణం తొలి దశలో గుర్తించలేకపోవడమే అన్నారు. స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, గర్భకోశ ముఖ ద్వారం వద్ద ఈ వ్యాధులు వస్తాయని, పురుషులకు ఊపిరితిత్తులు, గొంతు, కడుపు, పేగుల క్యాన్సర్ వస్తుందని తెలిపారు. పొగాకు ఏ రూపంలోనైనా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. సిగరెట్టు, గుట్కా, పాన్ మసాలా లాంటిది దూరంగా ఉండాలని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి అనేది నొప్పి లేకుండా తీవ్రతరం అవుతుందని తెలిపారు. గర్భస్థ ముఖద్వారా క్యాన్సర్‌కు వ్యాక్సిన్ ఉందని తెలిపారు.

జాతీయస్థాయి డాన్స్ స్పోర్ట్‌లో మెరిసిన కదిరి మనుష్ విద్యార్థులు

శాప్ చైర్మన్ రవి నాయుడుని కలిసి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

విశాలాంధ్ర-కదిరి: జాతీయస్థాయి డాన్స్ స్పోర్ట్‌లో మెరిసినట్లు కదిరి మనుష్ డాన్స్ మాస్టర్ డా. తేపల్లి మనోహర్ తెలిపారు. మంగళవారం ఆయనతో పాటు విద్యార్థులు కలిసి శాప్ చైర్మన్ రవి నాయుడు కలిసి కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మురళీకృష్ణ, కోచ్ మనోహర్ మాట్లాడుతూ డాన్స్ ను డాన్స్ స్పోర్ట్ గా చేసి 2024లో ఒలింపిక్ గేమ్స్ లో మొదటిసారి పొందుపర్చిన సంగతి ని గుర్తు చేశారు. ఈ మధ్య పంజాబ్ లోని ఘర్షంకర్ లో జరిగిన 15వ జాతీయ డాన్స్ స్పోర్ట్ ఛాంపియన్షిప్ 2025లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర%శీ% నుండి 15మంది పాల్గొని, అందులో 08మంది ద్వితీయ, 5మంది తృతీయ స్థానాలను మిగిలిన ఇద్దరిని సెకండ్ రన్నరప్ కైవసం చేసుకున్నారని శాప్ చైర్మన్‌కు వివరించారు. రాబోయే రోజుల్లో డాన్స్ స్పోర్ట్ కు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, మిగిలిన స్పోర్ట్స్ మాదిరిగా డాన్స్ స్పోర్ట్సుకు నిధులు కేటాయిస్తామని చైర్మన్ భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన బీసీ ఉద్యోగులు

విశాలాంధ్ర-ధర్మవరం : విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళవారం బీసీ ఉద్యోగులు కలిసి తమ సమస్యలపై ముఖ్యంగా చేనేత వస్త్ర వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ త్వరలోనే వస్త్ర వ్యాపారులు పడుతున్న ఇబ్బందుల మీద కమిటీలు నియమించి విధివిధానాలను రూపొందిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, ధర్మవరం వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు గిర్రాజ రవి, నీలూరి శ్రీనివాసులు, శశిధర్, హేమంతు, రమణ పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రథసప్తమి మహోత్సవ వేడుకలు అడ్డ హక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్, సభ్యులు, అర్చకులు, ఆలయ అధికారులు నడుమ వైభవంగా జరుపుకున్నారు. చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలతో పాటు ప్రత్యేక అలంకరణను అర్చకులు కొనే రాచారులు, మకరంద బాబు, భాను ప్రకాష్, చక్రధర్లు నిర్వహించారు. ఆలయం నుండి సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలల్లో స్వామివారిని పురవీధులలో ఊరేగించారు. ఏడు వాహనాలకు ఉభయ దాతలను ఆలయ చైర్మన్, ఆలయ అధికారులు పూజలు నిర్వహించి ఘనంగా సన్మానించారు. గత సప్తమి సందర్భంగా విరాళాలు ఇచ్చిన సేవాకర్తలకు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. అన్నమయ్య సేవా మండలి వారు శిష్య బృందం ఆలపించిన కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశులు, అడ్డ హక్ చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం, భక్తాదులు, దాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నరు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో గల శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా అర్చకులు రాజేష్ ఆచార్యులు ఆలయ అభివృద్ధి కమిటీ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, జింక రాజేంద్రప్రసాద్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నం శెట్టి రమేష్ కుమాం అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ మంత్ర పుష్ప యాగం నిర్వహించారు. ఉదయం ఐదున్నర గంటలకు శ్రీవారికి విశేష అభిషేక అర్చనలు, అష్టదళ పాద పద్మ ఆరాధనలు అర్చకులు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనములో స్వామిని ఆసీనులు చేసి పట్టణ పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తాదులు, దాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో... ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని చాటుకొని, ఇందు సాంప్రదాయాన్ని భావితరాలకు అందించాలని అర్చకులు సుదర్శనాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఆలయ అభివృద్ధి కమిటీ, ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు.వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

యోగాసనాలతో చక్కటి ఆరోగ్యం

యోగా కేంద్ర నిర్వాహకులు

సామూహిక సూర్య నమస్కారాలు

విశాలాంధ్ర-ధర్మవరం : యోగాసనాలు నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ చక్కటి ఆరోగ్యాన్ని ఇస్తున్నాయని మంగళవారం యోగా కేంద్ర నిర్వాహకులు తెలిపారు. పలుచోట్ల రథసప్తమి సందర్భంగా ప్రత్యేకంగా యోగా ప్రదర్శనలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ బాలుర పాఠశాలలో వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో 108 సామూహిక నమస్కారాలను యోగా ఆర్గనైజర్ నరసింహులు గౌరవాధ్యక్షులు గుర్రం వేణుగోపాల్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ యోగాలో 8 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయసు ఉన్న వారు కూడా 108 సామూహిక సూర్య నమస్కారాలను నిర్వహించారు. ప్రతిభ ఘనపరిచిన వారికి మెమొంటోళ్లను బహుమతి ప్రధానం చేశారు. స్వామి యోగాలయ ఉచిత యోగ శిక్షణ సెంటర్లో కూడా రథసప్తమి వేడుకలు సందర్భంగా యోగా ఆసనాలను యోగ మాస్టర్ చంద్రశేఖర్ భువనేశ్వరులు చెలిమి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో సూర్య నమస్కార ఆసనాలను దాదాపు 100 మంది యోగా సాధకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం యోగా మాస్టర్స్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయము సాయంత్రం యోగ ఆసనాలను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. సేవా భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణములో సూర్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు యోగా సాధకులు తిరుమలేష్ ఈశ్వరయ్య సూర్యుని చిత్రపటానికి పూలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం 108 సూర్య నమస్కారాలతో సామూహికంగా నిర్వహించారు. తదుపరి మోడల్ స్కూల్ విద్యార్థి జస్వంత్ చేసిన ఆసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆర్ఎస్ఎస్ విభాగ భౌతిక ప్రముఖ కిషోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజు సూర్య నమస్కారాలు చేయాలని తద్వారా చక్కటి ఆరోగ్యంతో పాటు మనశ్శాంతి కూడా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనతను అధిగమించాలి

కుష్టు, క్షయ నివారణ అధికారి తిప్పయ్య

విశాలాంధ్ర-చెన్నేకొత్తపల్లి : గర్భిణులు, రక్తహీనతను అధిగమించేలా ఆశా కార్యకర్తలు కృషి చేయాలని కుష్టు, క్షయ నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య సూచించారు. ఎన్ ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆశాడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఎన్.సి.డి సర్వే, ఆర్బీఎస్కే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం, రక్తహీనత గురించి, క్షయ వ్యాధి రాకుండా తీసుకవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవినాయక్ సీహెచ్‌ఓ గోవిందమ్మ, పీ.హెచ్.ఎన్. పద్మావతి, హెల్త్ సూపర్వైజర్లు వెంకట నారాయణ, రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, విష్ణువర్దన్, శ్రీనివాసులు, ఎమ్మెల్ హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE HINDUPUR

O.S.NO : 6/2021

R.చంద్రశేఖర్ మరియు ఇతరులు .... వాదులు

V/S

వెంకటప్ప మరియు ఇతరులు .... ప్రతివాదులు

ప్రతివాది 6.7.8 వారికి సమన్లు

6వ ప్రతివాది :- భాగ్యమ్మ, D/O క్రిష్టప్ప, వ్యవసాయము, సూగూరు గ్రామం హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా

7వ ప్రతివాది :- లలితమ్మ, D/O క్రిష్టప్ప, వ్యవసాయము, సూగూరు గ్రామం హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా

8వ ప్రతివాది :- సునితమ్మ D/O క్రిష్టప్ప, వ్యవసాయం, సూగూరు గ్రామం హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా

ఇందుమూలముగా తెలియచేయడమే మనగా వాదులు ప్రతివాదులపై విభాగముల కొరకు దావా వేసి ఉన్నారు అందులోపై తెలిపిన ప్రతివాదులు కోర్టుకు హాజరు కానందున ఈ పత్రిక ద్వారా తెలియచేయదమైనది. కనుక పైప్రతివాదులు 7-3-2025వ తేదీన పై తెలిపిన కోర్టు నందు ఉ.10-30 గం.లకు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలియజేయాలని కోరుచున్నాము. అట్లు కానియెడల మీ పరోక్షమున తీర్మానింపబడను.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ:- 7-3-2025

A.Nagaraju
వాదిపరంవకీలు,
హిందూపురం
9346245026

దండు మరిగమ్మ ఉత్సవ విగ్రహానికి విరాళం

విశాలాంధ్ర-లేపాక్షి: రాజీవ్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న దండు మరిగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమా నందన్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయనను కలిసిన ఆలయ కమిటీ సభ్యులకు 1 లక్ష 30, వేల అం దజేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం కోసం గతంలో చెప్పిన మాట మేరకు నగదును అందజేస్తున్నట్టు రమా నందన్ తెలిపారు. ఆయనకు కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర -అగళి : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని జడ్పీటీసీ ఉమేష్ ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం సరస్వతి పూజ కార్యక్రమానికి జడ్పిటిసి ఉ మేష్ మండల విద్యాధికారి చంద్రశేఖర్ నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు కెంచు యాదవ్ నాయకులు కసాపురం శివన్న ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చదువు పట్ల పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ జాఫర్ సిబ్బంది అతిథులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. ఎస్ఎంసి చైర్మన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడు పాడి ఆవులు చోరీ

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల పరిధిలోని తలమర్ల గ్రామానికి చెందిన. రైతుఫణీంద్ర రెడ్డి,కి చెందిన మూడు పాడి ఆవులు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి... ఇళ్ళ వెంకటం పల్లి గ్రామ సమీపంలో తమ వ్యవసాయ పొలంలో షెడ్ వేసుకుని ఆవులను మేపుకుంటూ జీవనం సాగించే వారు. రాత్రి షెడ్డుకు తాళాలు వేసుకొని తమ ఇంటికి వెళ్లగా ఉదయం వెళ్లి అక్కడకు చూడగా గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి మూడు ఆవులను చోరీ చేశారని వాటి విలువ రూ.2.30 లక్షలు ఉంటాయని బాధితుడు తెలిపారు.

పాఠశాలలో అక్రమాలను నిగ్గు తేల్చండి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాలని మంగళవారం కలెక్టర్ టిఎస్ చేతన్ కు బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ బాబ్జాన్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులను పక్కదోవ పట్టిస్తున్న పట్టించుకునే నాథుడే లేడని విచారణ జరిపించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా జనరల్ సెక్రటరీ గురివి రెడ్డి, చాంద్ బాషా, రమణ పాల్గొన్నారు.

పాఠశాల చదువులు.. మరపురాని గుర్తులు

విశాలాంధ్ర-కదిరి: పాఠశాల చదువులు... మరపురాని గుర్తులని 1973-74 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో వారు తెలిపారు. 1973-74లో బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల బృందం దేవస్థానం వీధిలోని శ్రీఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఆత్మీయగా ఒకరిని ఒకరు పలకరింపుతో పులకించిపోయారు.గతం లో ఆత్మీయ కలయిక - గురువులకు సన్మానం" అనే కార్యక్రమంలో అనుకున్న విధంగా వారి మిత్ర బృందంలో ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లల విద్య కోసం సహాయ సహకారాలను అందించాలని, డిగ్రీ కళాశాల గ్రౌండ్, బాలుర ఉన్నత పాఠశాల, ఆర్అండ్ బి బంగ్లా ఆవరణలో సీనియర్ సిటిజన్స్, మహిళలు ఉదయం సాయంకాల సమయంలో వాకింగ్ చేయు వారి సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇతర ప్రదేశాల నుండి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం "షెడ్" ఏర్పాటు,వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని శీతల పానీయ చలివేంద్రాల ఏర్పాటు తీర్మానించారు. ఆర్థికంగా వెనుకబడిన మిత్రుని కుమార్తె ఉన్నత చదువుల కోసం రూ.30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమం లో పదవ తరగతి 1973-74 మిత్ర బృందం అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా,ఉపాధ్యక్షు లు రామలింగయ్య,కార్యదర్శి బాషా,సహాయ కార్యదర్శి మండి రజివుల్లా,కోశాధికారి శ్రీనివాసులు (సత్రం శీనా) రెడ్డి, కాటం వీరనారాయణ, అల్లాబకష్,చంద్రశేఖర రెడ్డి, అజ్మతుల్లా ఖాన్,రమేష్ బాబు,సూర్య నారాయణ, జ్యువెలర్ సలీం,నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.భవిష్యత్తులో జరిగే సేవా కార్యక్రమాల్లో పాల్గొన దలచిన వారు 1973-74లో చదివిన పూర్వ విద్యార్థులు అత్తార్ మహబూ బ్ బాషా 9966459569 కు సంప్రదించాలన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం మునిసిపల్ చైర్మన్ కూటమి నాయకుడు డీఈ. రమేష్‌ను వారి స్వగృహంలో హిందూపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకుల ఉమేష్ ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం సన్మానించారు. మునిసిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో ముందుకు పోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రమణ, చక్రవర్తి, చిన్నా ప్రవీణ్, లోకేష్, భాస్కర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 5, ఫిబ్రవరి 2025

వైభవంగా రథసప్తమి వేడుకలు

పెన్నహోబిలం కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

కమణియంగా కల్యాణోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలంలో వెలిసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి మూల విరాట్‌కు తెల్లవారుజామునుండే ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ఉభయ దేవేరులతో కలసి నాలుగు వాహనాలలో మాడ వీధుల్లో విహరించారు. సుర్యప్రభ వాహన సేవతో మొదలై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గో, హనుమ, గరుడ వాహనా లపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. రథసప్తమి సందర్భంగా పెన్నహోబిలంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి కల్యాణోత్సవం కమణీయంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రమేష్ బాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారనల మధ్య స్వామివారితో ఉభయ దేవేరులకు మంగళ ధారణ కార్యక్రమం జరిపారు. ఆశేష సంఖ్యలో హాజరైన భక్తుల గోవింద నామస్మ రణల మధ్య శ్రీవారి కల్యాణం కమణీయంగా జరిగింది. స్వామీ వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. కార్యక్రమంలో కుమార్, అర్చకులు ద్వారాకానాథ్, బాలాజీ స్వామి, గుండు స్వామి, సత్యనారా యణ, భక్తులు పాల్గొన్నారు.

బూదగవి సూర్యనారా యణస్వామి ఆలయంలో

విశాలాంధ్ర-ఉరవకొండ: మండలంలోని బూదగవి,ఆమిద్యాల గ్రామాల్లో వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయాల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. రథసప్తమిని పురస్కరించుకుని బూదగవిలో ఆలయ అర్చకులు స్వామి వారి మూల విరాట్ కు విశేష పూజలు నిర్వహించారు. నవగ్రహ పూజా, అరుణహోమం తదితర పూజల అనంతరం ఉష, ఛాయాదేవిలతో సూర్యభగ వానుడి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. సూర్యభగ వానుడిని దర్శించుకునేం దుకు అనంతపురం జిల్లా వాసులే కాకుండా కర్ణాటక వాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. దింతో భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసి పోయాయి. ప్రపంచంలో దాక్షిణాభి ముఖంగా ఉన్న ఏకైక సూర్య భగవానుడి ఆలయం కావడం స్వామివారిని దర్శించుకుంటే ఆపమృత్యు దోషం పోతుందని భక్తుల నమ్మకం.అందుకే ప్రతి ఏటా రథసప్తమి రోజు వేలాదిమంది భక్తులు ఇక్కడ స్వామివారిని దర్శించుకుంటుంటారు. పలువురు వీఐపీలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు

ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించండి..

ఎమ్మెల్యే సింధూర రెడ్డి...

విశాలాంధ్ర-అమడగూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గజ్జల ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజలను అధికారులు ఆఫీసుల చుట్టూ తిప్పకుండా పని అవుతుందంటే అవుతుందని లేకపోతే కాదని వారికి క్షుణ్ణంగా తెలియజేయాలి అన్నారు. మండల వ్యవసాయాధికారి రమణాచారి మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రతి ఒక్కరికి ఈ క్రాఫ్, ఈ కేవైసీ, ఫార్మసీ ఐడి చేయించడం జరుగుతుందన్నారు. రైతు సమస్యలను ఏ ఒక్కటి పెండింగ్లో ఉంచరాదని, మండలంలోని రైతులకు ప్రతి గ్రామంలోను పొలం పిలుస్తోంది, పంట సాగుపై అవగాహన వంటి కార్యక్రమాలను చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో కళాశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్, వాచ్‌మెన్ పోస్టులు ఎక్కడైనా కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు టాయిలెట్స్ సరిగా లేవని ఎక్కువగా కంప్లైంట్ వస్తున్నాయని, పాఠశాలలకు నీటి సౌకర్యం సరిగా లేదని విద్యార్థులకు కనీస వసతులు కూడా లేవన్నారు. మండలంలోని సర్పంచులు ప్రతి ఒక్కరూ పంచాయతీ నిధులతో స్పేర్ బోర్ మోటార్లను ఉంచుకొని ప్రజలకు నీటి సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారులు ప్రభుత్వ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గతంలో లబ్ధిదారుల బిల్లులు పెండింగ్లో ఉంటే వాటిని వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్క ప్రభుత్వ అధికారి ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి, ఎంపీడీవో మునెప్ప, ఈవోఆర్‌టి నసీమా, ఏపీవో అమరావతి, ఏపిఎం, ఎంఈఓ జిలాన్ భాష, సర్పంచులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-రాయదుర్గం: మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఎంఈఎఫ్. లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్. జిల్లా ఉపాధ్యక్షులు తిప్పేస్వామి మంగళవారం పత్రికా ప్రకటనలో కోరారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా, ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో సామాజిక ఉద్యమ నేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఈనెల 7వ తేదీన హైదరాబాద్ మహానగరంలో లక్షల డప్పులు వేల గొంతులు భారీ సాంస్కృతిక ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-ఉరవకొండ: మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పని చేస్తూ పదవీవిరమణ పొందిన భగవాన్ దాస్ మరియు ఆశా కార్యకర్త రత్నమ్మను మంగళవారం రాకెట్ల పీహెచ్సీ కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పావని, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ 7 సంవత్సరాలుగా భగవాన్ దాస్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. సిహెచ్ఓ నాగరంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, రుద్రంపేట పీహెచ్సీ ఎంపీహెచ్ఈఓ శ్రీరాములు, భ్రమరాంబిక, స్థానిక పీహెచ్సీ వైద్య సిబ్బంది శేఖర్, స్వర్ణలత ఆశాలు భగవాన్ దాస్ రత్నమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బేవనహళ్లి పీహెచ్‌సీలో ఆశా డే

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని బేవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి జే.పద్మజ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ డే నిర్వహించారు. సత్యసాయి జిల్లా మలేరియా అధికారి డాక్టరు. ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీ నాయక్, హిందూపురం సబ్ యూనిట్ అధికారి శివన్న బేవనహళ్లి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఆరోగ్య కార్యక్రమాలపై రివ్యూ చేశారు. వారు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపట్ల, మలేరియా జ్వరాలు ప్రబలకుండా తీసుకొనవలసిన ముందు జాగ్రత్తలు, గర్భవతులు బాలింతలకు పిల్లలకు అందించాల్సిన సౌకర్యాలు సేవల గురించి వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యమ్. మల్లప్ప, ఆరోగ్య పర్యవేక్షకులు డి.కళావతి, యస్. సి. వెంకటరమణ ఎంఎల్ హెచ్పి, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: మండల కేంద్రములోని కెజిబివి పాఠశాలను తహసిల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశుభ్రత, వంటశాల, వాటర్ ట్యాంకులను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు, బోజన మెనూను, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని యస్ఓ గీత కు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

కర్ణాటక మద్యంపై మెరుపు దాడి

విశాలాంధ్ర-శెట్టూరు: అనంతపురం, ఎన్‌ఫోర్సుమెంట్ వింగ్, అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాలు మేరకు, ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, సబ్-ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఫణీంద్ర, కానిస్టేబుల్స్,మారుతి శివానందతో కలిసి కంబదూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో దాడులు నిర్వహించగా 110 హైవర్డ్స్ చీర్స్ విస్కీ కర్ణాటక లిక్కర్ టేట్రర పాకెట్స్ ను సీజ్ చేసి ఒక మహిళను అరెస్ట్ చేసి క్రైమ్ నెంబర్ 43/2025 కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇంచార్జ్ తహసీల్దార్‌తో ఇబ్బందులు..

విశాలాంధ్ర-చిలమత్తూర్: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఇంచార్జ్ తహసిల్దార్ ఉండడంతో పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్చార్జ్ సకాలంలో కార్యాలయంలో లేకపోవడంతో ప్రస్తుతం సబ్సిడీ లోన్స్ అన్ని కులాల వారికి పడడంతో తక్కువ సమయం ఉండడంతో కుల దృవీకరణ పత్రాలు, ఇన్కమ్ సర్టిఫికెట్లు కోసం, రైతు సమస్యల కోసం కార్యాలయంలో తహసిల్దార్ లేక పోవడంతో చూసి వెనుతిరుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల ప్రజలకు అనుకూలంగా ఉండేలా తహసిల్దారును నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అంటూ ప్రజల కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

విశాలాంధ్ర-కొత్తచెరువు: వాటర్ ప్లాంట్‌ను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్ రాజు తెలిపారు. మండల పరిధిలోనే మరుకుంటపల్లి గ్రామంలో సత్యసాయి బాబా భక్తులు అక్కడ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో. ఈ ప్లాంట్ ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూలల ప్రాంతాలలో ప్రజలకు పరిశుద్ధమైన నీరు అందించాలని ఉద్దేశంతోనే వీటిని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ వాటర్ ప్లాంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున తమ దృష్టికి రావడంతో వీటిని ఇక్కడ ఏర్పాటు చేసామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా తాగునీటిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. అనంతరం ఆయనను గ్రామ ప్రజలు సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సత్యసాయి భక్తుల థామస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాడి పశువుల రైతులు జాగ్రత్త

ఎస్సై రాజకుల్లయప్ప

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని గ్రామాలలో పాడి పశువులు ఆవులు ఏనుగులు ఎద్దులను గొర్రెలను మేకలను రాత్రి సమయంలో జాగ్రత్తగా వాటిపై ఒక కంట కనిపెడుతూ ఉండి రక్షించుకోవాలని వీలైతే తమ ఇంటి ఆవరణంలో వాటిని కట్టి జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎస్సై రాజు కుల్లాయప్ప మండల ప్రజలను కోరారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు.అనుమానాస్పద వాహనాలు రాత్రి సమయంలో మీ గ్రామంలో తిరిగితే వెంటనే గుడిబండ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని టోల్ ఫ్రీ నెంబర్ 100కు సమాచారం అందించాలని మూగజీవుల దొంగలించే వ్యక్తులను పట్టుకోవడానికి మండలంలోని ప్రజలు సహకరించాలని అలాగే గుడిబండ పోలీస్‌స్టేషన్ ఫోన్ నెంబర్ 9346010576కు సమాచారం అందించాలని తెలిపారు.

లక్ష డప్పులు వేయి గొంతులు విజయవంతం చేయండి..

విశాలాంధ్ర-ఉరవకొండ : ఎస్సీ రిజర్వేషన్లను ఏబీ సీడీలుగా వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల ని కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాదులో తలపెట్టిన లక్ష డప్పులు వెయి గొంతుల కార్యక్రమానికి కదంతొక్కాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఉరవకొండలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను ఒక సామాజిక వర్గం వారే లబ్ధి పొందుతూ వచ్చారన్నారు. ఈ రిజర్వేషన్లు మాల మా దిగల పంచాయతీ కాదని, 59 ఉప కులాలకు సంబంధించిందని సుప్రింకోర్టులో ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారని తెలిపారు. ఆరునూరైనా వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. మూడు దశాబ్దాలుగా ఏబీసీడీ వర్గీకరణతో పాటు సామాజిక ఉద్యమాలు శాంతియుతంగా నడుపుతున్న మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ఇవ్వడం మాదిగ జాతికి గర్వకారణమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మరియు ఎం ఈ ఎఫ్ నాయకులు రమేష్ బాబు, బెంజిమెన్, కింగూరి ఎర్రి స్వామి, ఎల్లప్ప, ఓబయ్య తిప్పయ్య పాల్గొన్నారు.

లక్షల డప్పులు వేల గొంతుల గోడ పోస్టర్ల విడుదల..

విశాలాంధ్ర-యాడికి: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జ్ ఎంపీ పుల్లయ్య,యాడికి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు జి.నరసింహులు, యాడికి మండల ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు యన్.సూర్యుడు, ఆధ్వర్యంలోహైదరాబాద్‌లో ఫిబ్రవరి 7 జరిగే లక్షల డప్పులు వేల గొంతుకలు మాదిగల సంస్కృతి భారీ మహా ప్రదర్శన గోడ పోస్టర్లను తాడిపత్రి నియోజకవర్గం కో ఇన్చార్జ్ ఎంపీ పుల్లయ్య, యాడికి మండల సిపిఐ మండల కార్యదర్శి జిల్లా మైనార్టీ కార్యవర్గ సభ్యుడు జూటూరు రఫీ,స్టాంప్ రైటర్ జూటూరుఅబ్దుల్ రజాక్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుల్లయ్య మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 1994 సంవత్సరం నుంచి నేటి వరకు ఏబిసిడి వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేయగా 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఏడుగురి ధర్మారం జస్టిస్ చంద్రచూడ్ అనుకూలమైన తీర్పు ఇచ్చారు అన్నారు. అయినా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం కమిషన్ పేరుతో కాలయాపన చేస్తున్న తీరు సరికాదన్నారు. మిగతా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వెంటనే ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలని ఈనెల ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే లక్షల డప్పులు వేల గొంతుకలు మహా ప్రదర్శనకు యాడికి మండలంలోని మాదిగ, మాదిగ ఉపకులాల వారు డప్పు కళాకారులు మాదిగ ఉద్యోగస్తులు డప్పులు సంకనేసుకుని డప్పుల మోత మోగించాలని ఆ మోతకు వ్యతిరేక శక్తుల గుండెల్లో రైలు పరిగెత్తాలి అన్నారు. కార్యక్రమంలో జి కుల్లాయప్ప, జి రామాంజనేయులు, కోన ఉప్పలపాడు గాంధీ కమలపాడు వెంకట రమణయ్య, కోనఉప్పలపాడు టైలర్ పుల్లయ్య, వేములపాడు బాలాజీ పిన్నేపల్లి మారెన్న, పిన్నేపల్లి రాజా,నగరూరు సూరి, కోన ఉప్పలపాడు బాలు, కోన ఉప్పలపాడు వెంకట్ రాముడు ఎంఆర్పిఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపూరి మహాలక్ష్మికి ఘనంగా జ్యోతుల ఉత్సవాలు

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని హనుమనపల్లి గ్రామంలో మంగళవారం కొల్లాపూరి మహాలక్ష్మి అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. రోళ్ల మండలం రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్లాపూరి మహాలక్ష్మి అమ్మవారిని సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో మేళతాళలతో వాయిద్యాల నడుమ ఊరేగింపుగా హనుమనపల్లి గ్రామానికి తీసుకొని వచ్చి గ్రామం నడిఒడ్డున పట్టంగా కూర్చోబెట్టారు. మంగళవారం ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవలు వివిధ పూలమాలలతో ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షతో జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి ప్రదక్షిణలు చేసి జ్యోతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్ మండల పార్టీ కన్వీనర్ కుమార్ స్వామి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు రమేష్ నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు కెంచు యాదవ్ ఆర్‌జి పల్లి రంగప్ప కసాపురం శివన్న వైకాపా నియోజకవర్గ సమన్వయ కర్త ఈరలక్కప్ప జడ్పీటీసీ అనంతరాజు కన్వీనర్లు నరసింహారెడ్డి, స్టూడియో శ్రీనివాస్ కాంతరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు పెంచాలి

విశాలాంధ్ర-తలుపుల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అఫ్తాఫ్ డాక్టర్ ఆశ్రిత నిర్వహించిన ఆశా డే మీటింగ్‌కు డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో కానుపులను పెంచాలని, హై రిస్క్ గర్భవతులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి అన్ని వైద్య పరీక్షలు చేపించి, సురక్షిత కానుపు అయ్యేవరకు నిరంతర పర్యవేక్షణ వహించాలని ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంలకు సూపర్వైజర్లకు ప్రత్యేకించి తెలియజేయడం జరిగింది. అంతే కాక అనీమియా ముక్త్ భారత్ కింద రక్తహీనత గల గర్భిణులకు పౌష్టికాహార పదార్థాలు అందేలా చూడాలని తెలియచేశారు. సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. ఫిబ్రవరి 10వ తేదీన జరగబోయే జాతీయ నులి పురుగుల నిర్మూలనపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కదిరి టిబి యూనిట్ సూపర్వైజర్ శ్రీనివాసులు పాల్గొని, క్షయ వ్యాధిపై ఇంటింటి సర్వే చేసి, టిబి కేసులను గుర్తించాలి అని తెలిపారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయండి

మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప

విశాలాంధ్ర-రొళ్ల : వైసీపీ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతానికి కృషి చేయాలని మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. మంగళవారం మండల సమీపంలో శివాలయంలో వైకాపా మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ మండల స్థాయి కమిటీలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి వైసీపీని బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త అధర్య పడకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు.ప్రజా సమస్యలపై వైఎస్ఆర్ సీపీ నాయకులు నిరంతరం పోరాడుతూ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలవద్దకు తీసుకువెళ్లి ప్రజలకు మనోధైర్యం నింపాలన్నారు కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని అటువంటి కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని 2029 ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత వైసీపీ నాయకులు కార్యకర్తలపై ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు బి.అనంతరాజు, వైసీపీ అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా అనుబంధ విభాగం అధ్యక్షులు రంగేగౌడు,వైకాపా మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, వైకాపా సీనియర్ నాయుకులు విజయ రంగేగౌడు, సర్పంచులు రాజప్ప,హరికృష్ణ,ఎంపీటీసీలు లింగరాజు, జగదీష్, వైసీపీ జిల్లా కార్యదర్శి బ్యాడగేరి, వైస్ సర్పంచ్ దొమ్మరహట్టి రవికుమార్, రవి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే చేయండి

విశాలాంధ్ర-శెట్టూరు : మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో రెండో విడత భూముల రీసర్వే పనులను మంగళవారం ఆర్డీవో వసంత్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మాదిరిగా కొలతల్లో తప్పులకు తావు లేకుండా, భూ యజమానులు రైతుల నుంచి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా రీసర్వే చేపట్టాలని సూచించారు. ఈ రెవెన్యూ గ్రామంలో మొత్తం 7,137 ఎకరాల 21సెంట్లు ఉండగా ఏఒక్క రైతుకు ఇబ్బంది లేకుండా రీసర్వేను చేసి ప్రతి రైతుకు న్యాయం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వర్‌శెట్టి మండల సర్వే యర్‌లు మున్వర్ భాషా, సుబ్రహ్మణ్యం, వీఆర్వో తిప్పేస్వామి, విశ్వనాథ్, విలేజ్ సర్వేయర్ పవన్, ముక్కనేశ్వర రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిప్పారెడ్డిపల్లిలో ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణం లో తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధుసూదనరాజు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్‌కు ఐదుగురిని గుర్తించారు. అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరాముడు, 104 డిఇఓ అనిల్, పైలట్ బాలాజి, ఏయన్‌యం స్వర్ణలత పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా నీలకంఠ

విశాలాంధ్ర-నార్పల : మండల నూతన విద్యుత్ ఏఈగా నీలకంఠ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సమ స్యలు పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

ఆశ కార్యకర్తలు బాగా పనిచేయాలి

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆశాడే కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి వివరించి ప్రతినెల వారికి ఇచ్చిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ఫిక్స్ టూర్ ప్రోగ్రాం ప్రకారం వారి వారి గ్రామంలో పర్యటించాలని తెలిపారు. గ్రామంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే, వ్యక్టార్ కంట్రోల్ ప్రోగ్రాం ప్రతి సోమవారం రైట్ చేసి బుధవారం లోపల ఇష్యూను క్లోజ్ చేయాలని తెలిపారు. సిహెచ్ఓ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల పంపిణీ..

విశాలాంధ్ర-శెట్టూరు : మండల పరిధిలో మాకొడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవతరగతి విద్యార్థు లకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత రూపొందించబడిన 10వ క్లాస్ మోడల్ పేపర్స్ ఉపాధ్యాయుడు బద్దెనాయక్ ఉచితంగా అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులుతో సాధించాలని ఆకాంక్షించారు. మోడల్ పేపర్ల నుంచి 70శాతంపైగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.